

18 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు సోమవారం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 18 మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం ఉదయం ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి వాహనదారులకు 18 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.1,80,000లు జరిమానా విధించడం జరిగింది. 1 నెల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 717 మందికి సుమారు 71.7 లక్షల రూపాయల ఫైన్ విధించడం జరిగింది. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లాలోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు తెలిపారు.

పకడ్బందీగా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్: డిఆర్ఓ



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ మోహన్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు 2025లో భాగంగా ఫిబ్రవరి 5 నుండి ఫిబ్రవరి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్ఓ కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని డిఆర్ఓ ఛాంబర్ వద్ద గల సమావేశపు మందిరంలో ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు -2025లో భాగంగా ఫిబ్రవరి 5 నుండి 20 తేదీ వరకు మూడు విడతల్లో మొదటి, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలను 69సెంటర్ల (ఒకేషనల్ సెంటర్లతో కలిపి)లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 12,311 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ఫిబ్రవరి 5 నుండి 9 వరకు 11 కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసువారు చర్యలు చేపట్టాలని, సకాలంలో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఆర్టిసి వారు బస్సులను నడపాలని, పరీక్షా కేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా ట్రాన్స్కో అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించుటలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆర్ఐఓ సయ్యద్ మౌలా, స్పెషల్ ఆఫీసర్ దయానంద రాజు, జిల్లా పరీక్షల నిర్వాహణ కమిటీ సభ్యులు బాలసుబ్రమణ్యం రాజు, నిర్మలా కుమారి, శరత్ చంద్రశేఖర్, హేమలత, వెంకటరమణ రెడ్డి, చిత్తూరు డివైఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కుంటుపడుతున్న అభివృద్ధి

- మండల ప్రజా పరిషత్ నిధులు మా కంటే.. మాకే కావాలంటూ గొడవ..
- టిడిపి, వైసిపిల మధ్య కుదరని సయోధ్య..
- ప్రేక్షక పాత్ర వహిస్తున్న మండల అధికారులు



యాదమరి మండల ప్రజాపరిషత్ కార్యాలయం

ప్రజాశక్తి- యాదమరి

యాదమరి మండల ప్రజాపరిషత్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.70 లక్షల నిధులు అభివృద్ధి పనులు చేపట్టకుండా నెలల తరబడి మురుగుతున్నాయి. మండల ప్రజాపరిషత్‌ను గత 20 సంవత్సరాలుగా ప్రస్తుత జడ్పీ వైస్ ఛైర్మన్ బి.ధనుంజయ రెడ్డి కనుసనల్లోనే మండల ప్రజా పరిషత్ పరిపాలన కొనసాగుతోంది. ఈ నిధులు ఖర్చు పెట్టడంలో ఇటు వైసిపికి చెందిన మండల ప్రజాపరిషత్ పాలపక్షం ససేమిరా అంటున్నాయి. ప్రస్తుత 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి పూతలపట్టు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి డాక్టర్ కలిగిరి మురళీమోహన్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అందులో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం రావడంతో మండలంలో తెలుగుదేశం నాయకుల హవా కొనసాగుతుంది. మండల ప్రజాపరిషత్ నిధులు, మండల అభివృద్ధి పనులు మేమే చేస్తామని ఆ నిధులు మాకే కావాలని, అధికారపక్షం నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. మండలంలో తెలుగుదేశం పార్టీ అధికారపక్షం... ప్రజా పరిషత్ పాలకపక్షం వైసిపి ఇటు రెండు ఇరు వర్గాల నాయకులు, ప్రజాప్రతినిధుల మధ్య సయోధ్య కుదరకపోవడంతో మండల గ్రాంట్ నిధులు బ్యాంక్ అకౌంట్లో మురుగుతున్నాయి. ఈ నిధులు ఖర్చు పెట్టడంలో మండలస్థాయి అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు.


కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, పిఎఫ్ఎంఎస్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీలకు, పంచాయతీ నిధులు, మండల ప్రజాపరిషత్‌కు, మండల నిధులు, జిల్లా ప్రజా పరిషత్‌కు, జిల్లా నిధులను మంజూరు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు కేటాయించడంలో పంచాయతీలోని జనాభా ప్రాతిపదికన ఒక్కొక్కరికి రూ.350లు నిధులు కేటాయించేది. అవి ఇప్పుడు ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా ఒక్కొక్కరికి 500 నుండి 600 దాకా గ్రామపంచాయతీ, మండలం పరిషత్, జిల్లా పరిషత్‌లకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయిస్తున్నది. 15వ ఆర్థిక సంఘం నిధులను 2020 నుండి 2025 ఐదు సంవత్సరాలపాటు ఈ నిధులను ప్రతి సంవత్సరం రెండు దఫాలుగా కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయిస్తున్నది. ఈ నిధులు టైడ్ అండ్ టైడ్ ప్రాతిపదికన ఖర్చు చేయాల్సి ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 60 శాతం గ్రామాల్లోని పారిశుద్ధ్యం, సురక్షిత తాగునీరు, వాటికి ఖర్చు చేయాల్సి ఉంది. మిగిలిన 40శాతం నిధులను గ్రామాల్లోని డ్రైనేజీ కాలువలు, పైపులైన్లు, రోడ్లు, ప్రహరీలు, భవనిర్మాణాలు, పంచాయతీలేని అన్ని రకాల అభివృద్ధి పనులకు నిధులను బట్టి వెచ్చించి ఖర్చు పెట్టాల్సి ఉంది. అలాగే మండల గ్రాంట్ నిధుల్లో 5 శాతం మేర నిధులు కార్యాలయం మెయింటినెన్స్, ఆఫీస్ ఫర్నిచర్, కార్యాలయంలో మొదలు అవసరాలకి ఈ నిధులను ఖర్చు పెట్టాల్సి ఉంది. ఈ ఆర్థిక సంఘంలో మంజూరైన నిధులను అభివృద్ధి పనులు, మౌలిక అవసరాలు, ప్రజాప్రయోజనాలకు ఉపయోగకరంగా వెచ్చించి కనీసం రెండు సంవత్సరాలలోపు ఖర్చు చేయాల్సి ఉంది. అయితే యాదమరి మండలంలో ఇటు ప్రజాప్రతినిధులు పాలకపక్షం, అధికారులు, నిర్లక్ష్యం ఉదాసీనత కారణంగా సుమారు రూ.70 లక్షలు దాకా నిధులు ఖర్చు పెట్టకుండా మురుగుతున్నాయి. మండలంలో చాలా ప్రాంతాల్లో తాగునీటి సమస్య, రోడ్ల డ్రైనేజీల సమస్యలు అధికంగా ఉన్నాయి. అలాంటి వాటికి వెచ్చిస్తే గ్రామాల్లోని సమస్యల పరిష్కారమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి మండల పరిషత్ నిధులను మండంలోని గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రయోజనాలకు ఖర్చు పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేలకు జిల్లా పరిషత్ అభివృద్ధి నిధులు

చిత్తూరు జిల్లా పరిషత్ 15వ ఆర్థిక సంఘం అభివృద్ధి నిధులను చిత్తూరు జిల్లాలోని ఒక్కో ఎమ్మెల్యేకు నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.50 లక్షలు, అలాగే జడ్పిటిసి సభ్యులకు, మండలంలోని అభివృద్ధి పనులకు రూ.30 లక్షలు చొప్పున నిధులు కేటాయించినట్లు సమాచారం.

అభివృద్ధి పనులు చేసేందుకు అంచనాలు తయారు చేస్తున్నాం...

- వేణు, మండల అభివృద్ధి అధికారి, యాదమరి



మండల ప్రజాపరిషత్ నిధులకు సంబంధించి పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు మండలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అంచనాలు తయారు చేస్తున్నారు. వీలైనంత త్వరగా ఈ నిధులను గ్రామపంచాయతీలోని ప్రజాప్రయోజనాలు ఉపయోగపడే అభివృద్ధి పనులను పంచాయతీ పరిధిలోని ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పనులు చేపడుతాం.

వసతి గృహాలకు పూర్వ వైభవం తీసుకొస్తాం

రూ.9 కోట్లతో వసతి గృహాల మరమ్మతులు: డిప్యూటీ డైరెక్టర్



ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డెప్యూటీ డైరెక్టర్

ప్రజాశక్తి- కార్వేటినగరం: దుస్థితికి చేరుకుని ప్రభుత్వ వసతి గృహాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రభుత్వ వసతి గృహాలను మరమ్మతు చేయడానికి రూ.8.60కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీంతోపాటు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ అందించిన రూ.40 లక్షలతో కలిపు రూ.9 కోట్లతో వసతి గృహాలను మరమ్మతు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఇందులో భాగంగా కార్వేటి నగరంలోని ఇంటిగ్రేడ్ వసతి గృహం మరమ్మతులకు రూ.60 లక్షలు. ఎస్సీ బాలికల వసతి గృహానికి రూ.40 లక్షలు, అదే విధంగా సుబ్రమణ్యస్వామి ఆలయ సమీపంలో ఉన్న ఎస్సీ కళాశాల విద్యార్థుల వసతి గృహం ఆధునీకరణకు రూ.18.50లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నియని నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాణ్యత కొరవడితే బిల్లులు మంజూరు చేయలేమని తేల్చి చెప్పారు. వసతి గృహాల్లోని మరుగుదొడ్లు, పెచ్చులూడుతున్న పైకప్పులు, కిటికీలకు సైతం మరమ్మతులు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం తాగునీటి సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత వార్డన్లపై ఉందన్నారు. ఆయన వెంకట ఈఈ మురళీధర్ రెడ్డి, ఎఈ సుబ్రమణ్యంరెడ్డి, ఏఎస్ డబ్ల్యూఒ శ్రీనివాసులు, హేమలత, ధశరధన్, సుబ్బరత్న, పాల్గొన్నారు.

కేన్సర్ నివారణ స్క్రీనింగ్‌తోనే సాధ్యం



చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర పరిధిలోని మురకంబట్టు అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం అని డాక్టర్ ఆశ తెలిపారు. డాక్టర్ ఆశ మాట్లాడుతూ ఆరోగ్యకర జీవనశైలి, ప్రవర్తనతో కేన్సర్‌ను నియంత్రించ వచ్చు అన్నారు. గుట్కా, పోగాకు తాగడం, మద్యపానం, ఎక్కువగా గర్భ నిరోధక మాత్రలు మింగడం వల్ల, కొన్ని రకాల ఇన్ఫెక్షన్ వల్ల, ఒకే రకమైన ఆహారపు అలవాట్ల వల్ల, వ్యాధినిరోధక శక్తి చాలా తక్కువగా ఉండటం వల్ల, కొన్ని జన్యు సంబంధ కారణాల వల్ల, ఊభకాయం వల్ల కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. సూపర్వైజర్ సుమతి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ దినేష్, డాక్టర్ వినయ్ సిబ్బందితో కలిసి కేన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకుంటే వ్యాధిని పూర్తిగా అరికట్టవచ్చునని తెలిపారు.



రొంపిచెర్లలో..



సోమలలో..

సోమల: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మండలంలోని సోమల పెద్ద ఉప్పరపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం అని, అందరికీ కేన్సర్ పరీక్షలు ఇంటి వద్దకే వచ్చి చేయడం జరుగుతుందని, ముందస్తు పరీక్ష ద్వారా కేన్సర్ నుంచి రక్షణ పొందవచ్చునని తెలిపారు. వైద్యాధికారులు బాలాజీ, జయసింహ, ప్రదీప్ కుమార్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు.

కుప్పం టౌన్ : కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ నారాయణమూర్తి ప్రపంచ కేన్సర్ దినోత్సవం నిర్వహించారు. కేన్సర్ రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. అధ్యాపకులు డాక్టర్ చంద్రబాబు, డాక్టర్ గణేష్, డాక్టర్ అపర్ణాదేవి, రవిశంకర్, సోమశేఖర్, వెన్నెల పాల్గొన్నారు.



సదుంలో..

సదుం : మండల పరిధిలోని చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ గిరీష ఆధ్వర్యంలో ప్రజలకు కేన్సర్ ముందస్తు నివారణ చర్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇ.పుష్పకుమారి, సదుం సిహెచ్‌సి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాలి కృష్ణారెడ్డి, సిబ్బంది ఉదయ భాస్కర్, నీలకంఠ, జానకి, శిఖామణి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో

మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నేషనల్ హెల్త్ మిషన్ టీం డాక్టర్ పర్వీన్ సుల్తానా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ జాతీయ ప్రోగ్రాంలైన ఎన్‌సిడి, సిడి, మాతా శిశు సంరక్షణ, ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వ లెన్స్ ప్రోగ్రాం, వ్యాధి నిరోధక కార్యక్రమం, టీబీ, లేప్రోసి, హెచ్ఐవి ఎయిడ్స్, బ్లైండ్నెస్ కంట్రోల్ ప్రోగ్రాం, మలేరియా నియంత్రణ కార్యక్రమం, వివిధ జాతీయ కార్యక్రమాలకు ప్రభుత్వం ఇచ్చిన అమౌంట్ వాటికి సంబంధించిన ఖర్చులు గురించి సమీక్షించి సంతోషం వ్యక్తం చేశారు. అలాగే జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లయితే చాలా రకాలైన వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చు అని, మాత శిశు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. సమాజం ఆరోగ్యానికి మొట్టమొదటి సూచిక మాతాశిశు ఆరోగ్యమే అని కావున ఆ దిశగా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. డాక్టర్ వెంకట ప్రసాద్, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అర్పిత, డాక్టర్ జానకిరామ్, డాక్టర్ శిరీష, డాక్టర్ అనిల్ , వేణుగోపాల్, శ్రీవాణి, కేటీప్రసాద్, రామ్మోహన్, మంజునాథ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

దోమల వృద్ధిని అరికట్టాలి

జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుధారాణి ఆదేశాలతో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం సబ్ యూనిట్ అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అక్కడక్కడ మలేరియా, డెంగీ లక్షణాలు కనిపిస్తున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల లార్వాలు ఉన్న అన్ని ఏరియాలలో స్ప్రేయింగ్ చేపట్టాలని తెలిపారు. పారామెడికల్ సిబ్బందితో మానిటర్ చేస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించాలన్నారు. ఏఎంఓ రామచంద్ర రెడ్డి, సబ్‌యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- రొంపిచర్ల : పులిచెర్ల మండలానికి మంజూరైన వివిధ కులాల కార్పొరేషన్ రుణాలకు అర్హత గలవారు ఈనెల ఏడవ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఇంచార్జ్ ఎంపీడీవో రాజశేఖర్ బాబు తెలియజేశారు. బీసీలు, ఓసీలు, ఈ బీసీలు రుణాల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. కాపు కులాలకు చెందిన అభ్యర్థులు 21నుంచి 50 సంవత్సరాలు, కమ్మ, రెడ్డి, బీసీలు, ఈ బీసీలు 21 నుంచి 60 సంవత్సరాలు మధ్య గలవారు రుణాల కొరకు అర్హులుగా నిర్ణయించినట్లు తెలిపారు.

5న ఐఓసిఎల్‌లో మాక్ డ్రిల్ : డిఆర్ఓ



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, యాదమరి: జాతీయ విపత్తు ప్రతి స్పందన దళం (ఎన్‌డి ఆర్ఎఫ్- నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) వారి ఆధ్వర్యంలో ఈనెల 5న యాదమరి మండలం ఐఓసిఎల్‌లో జరిగే మాక్ డ్రిల్‌లో సంబంధిత అధికారులందరూ పాల్గొనాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని డిఆర్ఓ ఛాంబర్ వద్ద గల సమావేశపు మందిరంలో ఈనెల 5న ఎన్డీఆర్ఎఫ్ వారిచే నిర్వహించనున్న మాక్‌డ్రిల్‌కు సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ విపత్తు పరిస్థితుల్లో ఎన్డీఆర్ఎఫ్ వారు పాత్ర కీలకమన్నారు. అనుకోకుండా వచ్చే విపత్తుల నుంచి ఎలా బయటపడాలనే విషయాలను మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. అనుకోని విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయడంలో భాగంగా ముందుగా దాని మీద అవగాహన అవసరమన్నారు. ఇందులో భాగంగానే మాక్ డ్రిల్‌కు సంబంధిత అధికారులు అందరూ హాజరుకావాలని సూచించారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ, ఎన్‌డిఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ అనితా సదన్, జిల్లా వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీకృష్ణ, డాక్టర్ ప్రభాకర్, ఏఆర్‌డిఎస్‌పి మహబూబ్ బాషా, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించాలి

వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్



ప్రయోగాలను పరిశీలిస్తున్న సునీల్ రాజ్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగం ఆద్వర్యంలో కె ఈ సి టెక్నికల్ ఫస్ట్ - 2025 ను అడ్వాన్స్ మైక్రోవేవ్, కాగ్నిటివ్ రేడియో ల్యాబ్ నందు నిర్వహించారు. సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఎఐఎంఎల్, డాటాసైన్సు, విభాగాల నుంచి బీటెక్ విద్యార్థులు పాల్గొని ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షులు సునీల్ రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రాజెక్ట్ ఎక్సపోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతికతను పెంపొందించుకుని తమ లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యార్థుల లక్ష్యా సాధనకు ఈ ప్రాజెక్ట్ ఎక్సపో ఒక వేదిక అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్లు డాక్టర్ కె. రసదురై, డాక్టర్ శేఖర్ నిర్వహించగా, డాక్టర్ అజయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ జ్ఞానమూర్తి, డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ సంతోష్, డాక్టర్ సతీష్ జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు. పి ఆర్ ఓ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాన్యులకు రుణాలు ఇవ్వాలి..

మాజీ ఎంపి చింతామోహన్



గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎస్సీ, బిసి, ఒబిసీలకు బ్యాంకు సబ్సిడీ రుణాలు మంజురు చేయాలని మాజీ ఎంపి చింతామోహన్ అన్నారు. మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ బ్యాంకులను దోచుకున్న వారికే రుణాలు మంజురు చేస్తున్నారని, చంద్రబాబు నాయుడు వర్గీకరణ పేరుతో కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పేదలకు బ్యాంకు రుణాలు మంజురు చేసేందుకు ఆంక్షలు పెడుతున్న బ్యాంకులు కార్పొరేట్ సంస్థలకు వేలకోట్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఎస్సీలకు 15, ఎస్టీలకు 7.5, ఒబిసీలకు 27 శాతం రుణాలు మంజురు చేయాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందన్నారు.

అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు



ప్రజాశక్తి- ఐరాల: శ్రీకాణిపాక వినాయకస్వామి దేవస్థానం కార్యనిర్వహణధికారి పెంచల కిషోర్ మంగళవారం ఆలయ పరిసరాల్లోని దుకాణ సముదాయాలు, పాలాభిషేకం, లగేజీ కౌంటర్, పాదరక్షలు, సెల్‌ఫోన్లు భద్రపరుచుకునే కౌంటర్ల వద్ద, కొబ్బరి కాయలు కొట్టే ప్రదేశంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. దుకాణదారులు భక్తుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే ఇకపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కొబ్బరికాయలు కొట్టు ప్రదేశంలో డబ్బులు వసూలు చేయకూడదని సూచించారు. భక్తుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం డాష్ బోర్డు, క్యూఆర్ కోడ్ల స్కానింగ్ గురించి భక్తులకు తెలియజేసి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఏఈవోలు రవీంద్రబాబు, ప్రసాద్, సూపరింటెండెంట్ రంగస్వామి పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని తహసిల్దార్ కార్యాలయాన్ని పలమనేరు సబ్‌కలెక్టర్ భవాని మంగళవారం ఉదయం 11 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా మండలంలోని ఆవులపల్లె రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన మరియు 22ఎ కింద చేర్చబడిన రైతుల వివరాలను అడిగి తెలుసుకుని కార్యాలయానికి వచ్చిన సంబంధిత రైతులతో మాట్లాడి వారి నుండి వివరాలను సేకరించారు. తహశీల్దార్ బెన్నురాజ్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



ప్రజాశక్తి- విజయపురం: మండల పరిధిలోని సామిరెడ్డి కండ్రిగ పంచాయతీ పరిధిలో అధికారులు ముమ్మరంగా పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మురుగు నీటి కాలువలు, ప్రధాన వీధులను పారిశుధ్య కార్మికులు శుభ్రపరుస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ, హేమలత, సర్పంచ్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఇష్టకమేశ్వరం గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈగ్రామంలో కాలువలు శుభ్రపరిచి నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్ను చల్లి దోమలు వ్యాప్తి చెందకుండా అరికడుతున్నారు. అనంతరం ప్రధాన వీధులలో హైపో ద్రావణాన్ని పిచికారి చేశారు. గ్రామంలో ప్రజలకు నీటిసమస్య ఏర్పడకుండా బోర్లకు మరమ్మతులు చేయించారు.

పనిచేయని ఆర్ఓ ప్లాంట్

ఇబ్బందుల్లో విద్యార్థులు



ప్రజాశక్తి- చౌడేపల్లి: మండలంలోని పంచాయతీ కేంద్రం చారాల ఉన్నత పాఠశాలలో శుద్ధ జలయంత్రం (ఆర్ఓ వాటర్ ప్లాంట్) మరమ్మతుకు గురికావడంతో మంచినీరు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ఓ వాటర్ ప్లాంట్ మరమ్మతుకు గురై 50 రోజులు అవుతున్న పట్టించుకునేవారు లేరని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత వాటర్ బాటిల్లను తాగుతున్నామని, అవి అయిపోయాక చుట్టుపక్కల ఉన్న ఇళ్లను ఆశ్రయించాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా ఆర్ఓ ప్లాంట్‌ను మరమ్మతులు చేయించి విద్యార్థుల దాహార్తిని తీర్చాలని వారు కోరుతున్నారు.


వాన పాముల ద్వారా సంపద సృష్టి



వాన పాములను వదులుతున్న ఈఓఆర్‌డి

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ ఇరికిపెంట గ్రామ సమీపంలోని ఎస్‌డబ్ల్యూపిసి షెడ్డు (బృందావనం) తొట్టెల్లో మంగళవారం పంచాయతీ సిబ్బంది, ఈఓఆర్డి లక్ష్మీదేవి వాన పాములను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఈఓఆర్డి మాట్లాడుతూ చెత్త నుండి సంపద సృష్టించే కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో సేకరించిన చెత్తను బృందావనాల లోని తొట్టెలలో తడి, పొడి చెత్తను వేరుచేసి తొట్టెలకు నింపి ఆ తరువాత వాన పాములను వాటిలో వదిలి తద్వారా ఎరువులను తయారు చేసి అవసరమైన రైతులకు అమ్మడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మేనక మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి చెత్తను వేరుగా పంచాయితీ చెత్త సేకరించే వాహనాలలో వేసి గ్రామాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని కోరారు. సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

డిసిసిబి బ్యాంక్‌ను తనిఖీ చేసిన సీఈవో



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న సీఈఓ మనోహర్ గౌడ్

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని డిసిసిబి బ్యాంక్ బ్రాంచ్‌ని డిసిసిబి సీఈవో మనోహర్ గౌడ్ తనిఖీ చేశారు. బ్యాంకు ద్వారా మండల పరిధిలోని ప్రజలు, రైతులకు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రుణాల వసూళ్లు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. సీఈఓతో పాటు బ్యాంక్ మేనేజర్ మహేష్, సిబ్బంది విజయ పాల్గొన్నారు.

నగరి ప్రీమియర్ లీగ్ సీజన్ -10

ప్రజాశక్తి- విజయపురం (నగరి):

మండలంలోని నగరి ప్రీమియం లీగ్‌లో మొత్తం 24 టీమ్స్ పాల్గొన్నాయి. ఒక్కొక్క జట్టు ఐదు మ్యాచ్లు ఆడగా మొత్తం 120 మ్యాచ్లు జరిగాయి. మొత్తం 24 జట్లు హోరాహోరీగా ఆడాయి. అందులో నాలుగు జట్లు క్వాటర్ ఫైనల్స్ ఆడగా రెండు జట్టు ఫైనల్ కొచ్చి, సెమీఫైనల్ ఆడడం జరిగింది. ఇందులో నగరి లేవన్, ఎన్‌సిసి జట్లు సోమవారం తలపడ్డాయి. వీరిలో మొదటగా నగరి టాస్ టాస్ గెలవగా వారు బ్యాటింగ్‌ను ఎంచుకున్నారు. వీరు 12 ఓవర్ల కుగాను 78/6 పరుగులు చేశారు. తరువాత బ్యాటింగ్ దిగిన తడుకుపేట జట్టు 79/6 సెమీస్ల విజయం సాధించడం జరిగినది. ఏవరైతే ఎన్‌పిఎల్ లీగ్ విజయం సాధిస్తారో ఆ విజేత టీమ్ వచ్చే సంవత్సరం ఎన్‌సిసి తడుకుపేట వారు వచ్చే ఎన్‌పిఎల్ లీగ్ -11 జరిపించడం ఆనవాయితీ. ఇందులో విజయం సాధించిన జట్టుకు ట్రోఫీ ఇవ్వడం జరిగింది.

వైభవంగా రథసప్తమి వేడుకలు



గ్రామవీధుల్లో ఊరేగుతున్న శ్రీవేణుగోపాలుడు

ప్రజాశక్తి - కార్వేటినగరం: మండల కేంద్రం కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అలాగే ఉత్సవర్ల సమర్పణ నిర్వహించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్లను పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచి వాహనంపై కొలువు దీర్చి ఉదయం 6 నుంచి8 గంటలకు చెక్క భజనలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా గ్రామవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే రాత్రి 7.45 నుంచి 8 గంటల మధ్య వేద పండితులు వేదమంత్రాల నడుమ ఏకాంతసేవలో స్వామివారిని పవళింప జేశారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్, షరాబ్ బాబు సురేష్, వేదపారాయణుడు శివరామ శర్మ, అర్చకులు గోపాలాచారి, రమేష్, శభరీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీరంగరాజపురం మండలానికి చెందిన గుణశేఖర్ నాయుడు భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహనమ్మ, గిరిబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని కంభంపల్లి పంచాయతీ పరిధిలో వెలసి ఉన్న ధ్యానాభిరామ స్వాముల వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ శాసనసభ్యులు ఎన్.అమర్నాథరెడ్డి గారి సతీమణి రేణుక రెడ్డి, మాజీ జెడ్పిటిసి రాధా కిషోర్ గౌడ్, తహశీల్దార్ మాధవరాజు, దాసర్లపల్లి గ్రామ రెవెన్యూ అధికారి లావణ్య పాల్గొన్నారు. స్థానిక సర్పంచ్ కోదండరెడ్డి ఘనస్వాగతం పలికారు.




ఏడు వాహనాలపై లక్ష్మీనారాయణుడు

గంగాధరనెల్లూరు: రథసప్తమి సందర్భంగా వేపంజేరి గ్రామంలో గల శ్రీ లక్ష్మీనారాయణ స్వామి మంగళవారం ఏడు వాహనాలపై భక్తులకు కనువిందుగా గావించారు. సూర్యప్రభ వాహనం, శేష వాహనం, అశ్వవాహనం, హంస వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, చంద్రప్రభ వాహనాలపై ఉత్సవ



మూర్తులను అధిరోహించి భక్తులకు దర్శనం కలిగించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో నుండి తరలివచ్చిన భక్తులకు ఆలయంలో వేపంజేరి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం మురళీకృష్ణ, స్కూల్ టీచర్లు బృందంతో కలిసి అన్నదానం చేశారు. ఆలయ మేనేజర్ వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణు స్వామి, గోవింద స్వామి, ద్వివేది, పాల్గొన్నారు.

చౌడేపల్లి: రథసప్తమిని పురస్కరించుకుని పట్టణంలోని లక్ష్మణ ఆంజనేయ సీతా సమేత శ్రీరాములు విగ్రహాలను ఊరేగించారు. షిరిడి సాయిబాబా ఆలయం సముదాయంలోని పుష్కరిణిలో శాస్త్రబద్ధంగా చక్రస్నానం నిర్వహించారు. చక్రస్నాన కమిటీ అధ్యక్షుడు దశరథ రామయ్య, కార్యదర్శి శ్రీనాథ్, కోశాధికారి గోపి, భక్తులు పాల్గొన్నారు.



రెండవ రోజు శిక్షణా కార్యక్రమం



అంటుకట్టె విధానాన్ని ప్రాక్టికల్‌గా చూపిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- కుప్పంటౌన్: పట్టణంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కూరగాయల అంటుకట్టు విధానం, హైడ్రోఫోనిక్స్ విధానంతోపాటు కూరగాయల పెంపకంపై జాతీయ స్థాయిలో జరుగుతున్న శిక్షణా తరగతులు రెండవ రోజు విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్బిట్ అధినేత శ్రీనివాస్ మాట్లాడుతూ ఇండో–ఇజ్రాయెల్ కూరగాయలలో అంటుకట్టే విధానాన్ని వివరించారు. ఇందులో భాగంగా వివిధ రాష్ట్రాలకు సంబందించిన ఉద్యాన అధికారులకు అంటు కట్టే విధానాన్ని ప్రాక్టికల్‌గా చూపించారు. తదుపరి గంగవరం మండలంలోని గ్రీన్‌ఆర్బిట్ ఫాంలో హైడ్రోపోనిక్స్ యూనిట్‌లో లెట్యూస్ సాగు విధానం, డ్రిప్ ఆటోమేషన్ యూనిట్, పాలిహౌస్‌లో పండిస్తున్న చెర్రీ టమాటో, క్యాప్సికమ్ పంటల గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి ఎంబస్సె బ్రహ్మదేవ్, ఏడీ హార్టికల్చర్ కోటేశ్వరరావు, కుప్పం, శాంతిపురం ఉద్యాన అధికారులు డింపు ప్రియ, వింధ్య, రైతు సేవాకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బాస్కెట్ బాల్ క్రీడాకారులకు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మైదానంలో బొంబాయి హెచ్ఐ ఫైవ్ ఆయిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాదుస్తులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా బాస్కెట్ బాల్ కోచ్ సలీం మేనేజర్ జయసూర్య మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్నామని, 120 మంది బాలబాలికలు శిక్షణ పొందుతున్నారని, ఇదివరకే యూత్ నేషనల్ రాష్ట్ర జిల్లాస్థాయిల్లో క్రీడాకారులు ప్రతిభ కనపరిచారని వారికి సంస్థ నుండి అభినందనలు తెలిపారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: స్వయం ఉపాధికి దరఖాస్తులు బీసీ కార్పొరేషన్ రుణాల కోసం మండలంలోని నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండలంలో 55 యూనిట్లు మంజూరు అయ్యాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి. రాజేంద్ర బాలాజీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీ లోపు గ్రామ సచివాలయాల ద్వారా దరఖాసులు చేసుకోవాలని తెలిపారు.

ప్రసాదం పాత్రలు వితరణ



ప్రజాశక్తి- కార్వేటినగరం: స్థానిక రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయానికి తిరుపతికి చెందిన భక్తురాలు బి.ఝాన్సీ, మురళీ దంపతులు స్వామివారికి ప్రసాదాలు తయారు చేసే వంట పాత్రలను ఆలయ అధికారి సురేష్ కుమార్‌కు అందించారు. అలాగే స్థానిక బౌండువీధికి చెందిన దేవారెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారికి డోలు, నాదస్వరం వితరణ చేశారు. తిరుపతి పట్టణానికి చెందిన చెంచుగార్ల క్రిష్ణమూర్తి తన తాత జ్ఞాపకార్థం సన్నాయి వితరణ చేశారు.

బాల కార్మిక వ్యవస్థ దేశ సమగ్రతకు ప్రమాదకరం

ప్రజాశక్తి- ఐరాల

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పాన్ ఇండియా బాల కార్యక్రమం కార్మిక నిర్మూలన, పునరావాస కార్యక్రమం మంగళవారం ఐరాల మండలం పొలకల సంత గేటులో గ్రేట్ విజన్ సొసైటీ స్వచ్చంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. పొలకల సంత గేటు, పరిసర ప్రాంతాలలో లేబర్ ఆఫీసర్ కెఆర్ ఆనంద్ బాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికులను ప్రోత్సహించడం చట్టరీత్య నేరమని, అలా ప్రోత్సహించిన వారు జైలు శిక్ష, జరిమానాలతో శిక్షించబడతారని అన్నారు. మండల పరిసర ప్రాంతాల్లో బడి బయట పిల్లలు శాతం తగ్గిందని ప్రతి ఒక్కరిని బడిలో ఉంచేలా చర్యలు తీసుకుంటామని, ఇంకా ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే అందరిని బడిలో ఉండేలా చేస్తామన్నారు. సిడిపిఓ నిర్మల, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్వైజర్ సబిత, సోషియల్ వర్కర్ ఉమాదేవి, జూనియర్ అసిస్టెంట్ దినేష్, మహిళా పోలీసులు శ్వేత, వాణి, సిఆర్‌పి ఏకాంబరం పాల్గొన్నారు.

పల్లెల్లో 'పొలం పిలుస్తోంది'

రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ శాఖ సిబ్బంది



ప్రజాశక్తి- సోమల: సోమల మండలం కందూరు పంచాయతీ పగడాలవారిపల్లె, తిట్టుపల్లె గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు సాగు మెలకువలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పుంగనూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు శివకుమార్ మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులను వాడి పంటలను పండించడం వల్ల ప్రజల ఆరోగ్యం భూమి ఆరోగ్యం బాగుంటుందన్నారు. వ్యవసాయ అధికారి సుధాకర్ మాట్లాడుతూ వరి సాగులో శాస్త్రవేత్తల సూచనలు సలహాలు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించడమే కాకుండా లాభాలు కూడా అర్జించవచ్చునని తెలిపారు. అనంతరం పలువురు రైతుల పంట పొలాల వద్దకు వెళ్లి వారు సాగు చేసిన పంటలను పరిశీలించి సలహాలు సూచనలు అందజేశారు. ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

తవణంపల్లి: మండలంలోని ఇచనేరి , మడవనేరి గ్రామాల్లో వ్యవసాయ అధికారి జి.ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువుల వాడకం గురించి అవగాహన కల్పించారు. ఉద్యానవన అధికారి సాగరిక మామిడిలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇచనేరి సర్పంచ్ ఉమమహేశ్వర్ రెడ్డి, సిబ్బంది సుహాసిని, కళ్యాణ్ కుమార్, కుసుమ పాల్గొన్నారు.

జ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి

జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

ప్రజాశక్తి- యాదమరి: మాతా శిశు మరణాలను నివారించడం ఎంత ముఖ్యమో ప్రజలు విషజ్వరాల భారిన పడకుండా కాపాడడం కూడా అంతే ముఖ్యమని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ సూచించారు. మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల నెలవారీ సమావేశం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ క్యేనర్ వ్యాధిపట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ దోమల వల్ల వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి ప్రాణాంతక జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే – డ్రైడే నిర్వహించాలని, దోమల వల్ల వచ్చే ప్రాణాంతక జ్వరాలు వాటిని అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి రామకృష్ణారెడ్డి, ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్వైజర్లు, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.



క్రమం తప్పకుండా మాత్రలు వాడాలి: డాక్టర్ సోమశేఖర్

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని బూచివనత్తం గ్రామ పంచయతీల్లో ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు షుగర్ బీపీ అధికంగా ఉందని డాక్టర్ సోమశేఖర్ అన్నారు. మంగళవారం నిర్వహించిన 104 వాహనం వద్ద డాక్టర్ సోమశేఖర్ గ్రామసులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు షుగర్, బీపీ పట్టణాలు మాత్రమే కనిపించేదని ప్రస్తుతం అది గ్రామస్థాయిలో ఎక్కువగా ఉందని, దీనికి ప్రధాన కారణం ఆహార అలవాట్లు, వ్యాయామం లేకపోవడం సరైన పౌష్టికాహారం తీసుకుపోవడమని ఆయన అన్నారు. షుగర్, బీపీతో బాధపడేవారు ప్రతిరోజు క్రమం తప్పకుండా మందులు వాడాలని, వ్యాయామం చేయాలని సూచించారు. ఎంపిహెచ్ఎ శివప్రసాద్, ఎఎల్‌హెచ్‌పి జయశ్రీ, 104 డీఈవో కుమారేష్, ఏఎన్ఎం గీతా, ఆశ వర్కర్ సాలీనా పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సోమశేఖర్

పశువైద్య విద్యార్థుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులు తమ వచ్చే ఉపకార వేతనం పెంచాలని కోరుతూ నిరవధిక సమ్మెను రెండో రోజు మంగళవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు జానపూడి ఇజ్రా మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మిగతా వైద్య విద్యార్థులతో సమానంగా తమకు కూడా తగినంత స్టైపెండ్ కల్పించాలని డిమాండ్ చేశారు. పశు వైద్య విద్యార్థుల స్టైఫెండ్ గత 12 ఏళ్లుగా ఏడు వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. మూడు నెలల క్రితం పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి తమ సమస్యలతో కూడిన ఉపకార వేతనం పెంపుదల వినతి పత్రాన్ని అందించారు. గత ఆరు నెలలుగా మేము స్టైఫండ్ పెరుగుతుందనే ఆశతో వేచి చూశామని అన్నారు. ప్రభుత్వం మా స్టైఫండ్ 7 వేల నుంచి మిగతా వైద్య విద్యార్థులకు ఇస్తున్న విధంగా పెంచేవరకు తమ సమ్మెను విరమించమని అధికారులకు తెలిపారు. తాము ప్రభుత్వానికి, యూనివర్సిటీ అధికారులకు వ్యతిరేకంగా తమ సమ్మెను నిర్వహించటలేదని విద్యార్థులు స్పష్టం చేశారు. పశువైద్య విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి డాక్టర్ జె.వి. రమణ, రిజిస్ట్రర్ డాక్టర్ శ్రీలత, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ శోభామణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ చంగల్ రాయులు, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య, ఓ.ఎస్.ఏ డాక్టర్ వేణులు విద్యార్థులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరానికి చేరుకొని విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకొని తాము ప్రభుత్వ అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళతామని, ఒక నెల సమయం ఇవ్వాలని విద్యార్థులను కోరారు.

క్రైం న్యూస్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ప్రజాశక్తి- చౌడేపల్లి

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చౌడేపల్లి మండలంలో చోటు చేసుకుంది. మృతుడి తల్లి రమాదేవి కథనం మేరకు.. పుంగనూరు మండలం పంచాయతీ కేంద్రం చదలకు చెందిన శివకుమార్ (27) గత రెండేళ్లుగా చౌడేపల్లి పంచాయతీ పొదలపల్లి వద్దగల కోళ్ల ఫారంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం కోళ్ల ఫారం ఆవరణంలోని ఓ గదికి గల ఇనుపరాడుకు చీరతో ఉరేసుకొని వేలాడుతుండటాన్ని గుర్తించిన అక్కడే పనిచేస్తున్న ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే తన కుమారుడిని కొట్టి చంపి ఉరికి వేలాడదీశారంటూ మృతుడు శివకుమార్ తల్లి రమాదేవి ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

లారీని ఢీకొన్న మరో లారీ

వ్యక్తికి గాయాలు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం:

ప్రమాదానికి గురైన లారీని మరో లారీ ఢీకొన్న సంఘటన మంగళవారం మండలంలోని మొగిలి గాట్‌లో చోటు చేసుకుంది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు.. మొగిలి ఘాట్‌లో సోమవారం ఉదయం ప్రమాదానికి గురైన లారీ పక్కకు ఆగి ఉండడంతో ఉత్తరప్రదేశ్ నుండి వస్తున్న మరో లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ సంఘటనలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అత్తోరోలకు చెందిన షోహి ఖాన్‌కు గాయాలు కాగా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి



ప్రజాశక్తి- బంగారుపాళ్యం:

మద్యం మత్తులో నీటి కుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని జీకే ఊరు గ్రామం సమీపంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. జీకే ఊరు గ్రామానికి చెందిన సుబ్బరామయ్య కుమారుడు రవి (50) అధికంగా మద్యం తాగి జీకే ఊరు సమీపంలో గల నీటి కుంటలో పడి ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. ఈయన దుబాయిలో పనిచేస్తూ తండ్రి సంవత్సరికానికి వచ్చి మంగళవారం మద్యం తాగి నీటి కుంటల పడి మృతి చెందాడు. శవపరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

అతి శీఘ్ర దర్శనం ప్రారంభం



ప్రజాశక్తి- చౌడేపల్లి: శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనాలను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఆలయ ఈవో, ఉప కమిషనర్ ఏకాంబరం, రమేష్‌రెడ్డి మాట్లాడుతూ బోయకొండకు వేలసంఖ్యలో భక్తులు వస్తుంటారని వారికి దర్శనం కొరకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం ప్రత్యేక దర్శనాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గిరిరాజు, బోయకొండ సుబ్బు, ఆలయ సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఏపీ డీజీపీ గా భాధ్యతలు చేపట్టిన హరీష్ కుమార్ గుప్తని తిరుపతి ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీ ఎఫ్) ఎస్పీ పీ శ్రీనివాస్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీ టాస్క్ ఫోర్స్ పని తీరును ఎస్పీని అడిగి తెలుసు కున్నారు. ఆపరేషన్స్, కూంబింగ్, అక్రమ రవాణాను అడ్డుకోవడానికి సాంకేతికంగా తీసుకుంటున్న చర్యలను ఎస్పీ శ్రీనివాస్ డీజీపీకి వివరించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి మరింతగా కృషి చేయాలని డీజీపీ సూచించారని ఎస్పీ తెలిపారు.